
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం, 27, అక్టోబర్, 2023



అటవీ పరిరక్షణ సామాజిక బాధ్యత

జీవవైవిధ్యం వృక్ష సంపద, జీవరాశులను సంరక్షణతోనే సుస్థిరత సాధ్యమవుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. 8లో



ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్య కల్యాణాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



సిరులతల్లికి సహస్ర తులసిపూజ

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ అత్యవసర సమావేశం

సాక్షి, పాడేరు: ఈనెల 30వ తేదీన పాడేరులో జరగనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక, సాధికారత బస్సు యాత్రకు సంబంధించి పాడేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంను శుక్రవారం నిర్వహిస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్,ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు,నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు,మండల అధ్యక్షులు, జేసీఎస్ కనీ్వనర్లు, నామినేటెడ్ పదవులు ప్రతినిధులు, పార్టీ జిల్లా నేతలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. తలారిసింగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఈసమావేశం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

నేడు అరకులోయలో జగనన్నకు చెబుదాం

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: అరకులోయ మండల పరిషత్ సమావేశమందిరంలో ఈనెల 27వతేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రత్యేక స్పందన జరుగుతుందన్నారు. అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు. అరకులోయ పరిధిలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. అన్నిశాఖల అధికారులు ప్రత్యేక స్పందన ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2గంటల తరువాత సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

నేటి ఐటీడీఏ స్పందన రద్దు

పాడేరు ఐటీడీఏలో శుక్రవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి ఐటీడీఏకు రావొద్దని ఆయన సూచించారు.

30న పాడేరులో మినీ జాబ్‌మేళా



ప్రిన్సిపాల్ సుజాత

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 30న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంస్థలు సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయన్నారు. ఈకామ్ డెలివరీ, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మినీ జాబ్‌మేళా జరుగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపై విద్యార్హత ఉన్న 18 నుంచి 24 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పాన్, ఆధార్‌కార్డులతో పాటు అన్ని ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరుకావాని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపికై న అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుంచి రూ.12వేల వేతనం చెల్లిస్తారన్నారు. పూర్తి వివరాలకు www. apssdc. ian వెబ్‌సైట్‌తోపాటు,6304634447 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

బస్తరు పిక్కలకు గిట్టుబాటు ధర

- 100 గ్రాములు రూ.100
- పోటాపోటీగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



పాడేరు మార్కెట్‌కు తీసుకువచ్చిన బస్తరు పిక్కలు

సాక్షి, పాడేరు: బస్తరు పిక్కలకు సీజన్ ప్రారంభంలోనే మంచి ధర లభించడం గిరి రైతులకు ఊరటనిస్తోంది. స్థానిక పాత బస్టాండ్ మార్కెట్లో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. గురువారం చిన్న బుట్ట పిక్కలకు రూ.వెయ్యి ధర లభించింది. వంద గ్రాముల పిక్కలను రూ.100కు విక్రయించారు. బస్తరు పిక్కల్లో మంచి పోషకాలు ఉన్నందున వీటి కొనుగోలుకు మైదాన ప్రాంత ప్రజలు ఆసక్తి చూపుతారు.

గిరి గ్రామాలకు వరం

మిషన్ కనెక్ట్



నిర్మాణ దశలో గిన్నెలకోట వంతెన

- మారుమూల గ్రామాల నుంచి పంచాయతీ కేంద్రాలకు రోడ్లు
- వాగులు, గెడ్డలపై వంతెనల నిర్మాణం
- పాడేరు ఐటీడీఏ పరిధిలో సత్ఫలితాలు
- పరిష్కారం కానున్న దశాబ్దాల నాటి సమస్యలు

పెదబయలు: పాడేరు ఐటీడీఏ పరిధి 11 మండలాల్లో అమలు చేస్తున్న మిషన్ కనెక్ట్ మంచి ఫలితాలనిస్తోంది. మారుమూల గ్రామాల నుంచి పంచాయతీ కేంద్రాలను కలిపేలా రోడ్లు, వంతెనలు నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు మారుమూల గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి.

- పెదబయలు మండలంలోని గిన్నెలకోట పంచాయతీ లండూలు-గిన్నెలకోట గ్రామాల మధ్యలో ఎస్‌సీఏ నిధులు రూ.1.40 కోట్లతో వంతెన నిర్మాణం జరుగుతోంది.
- పాడేరు నియోజకవర్గంలోని బొయితిల గ్రామ సమీపంలో మద్దిగరువు గెడ్డపై రెండు చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టారు. ఒక చోట వంతెనకు రూ.కోటి, మరొకదానికి రూ.2 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించింది.
- జామిగుడ నుంచి గుంజీవాడ గ్రామానికి వెళ్లే మార్గంలో జామిగుడ గెడ్డపై ఎస్‌సీఏ నిధులు రూ.2 కోట్లతో పనులను వచ్చే నెలలో చేపడతామని గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.
- అనంతగిరి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు మండలాల్లో మరో మూడు వంతెనలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

తప్పనున్న అవస్థలు

వర్షాకాలంలో ఆ మూడు పంచాయతీల ప్రజలు, ఒడిశా వాసులు గెడ్డలు దాటేందుకు నానా అవస్థలు పడుతుంటారు. డిప్పలు నడుముకు కట్టుకుని నది దాటుతుంటారు. వంతెనల నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పినట్టే.

- గిన్నెలకోట, జామిగుడ వంతెనల నిర్మాణం పూర్తయితే గిన్నెలకోట, జామిగుడ, ఇంజరి పంచాయతీలకు చెందిన 50 గ్రామాలతోపాటు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన చాలా గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుంది.

ఎమ్మెల్యే పాల్గుణ చొరవతో..

పెదబయలు మండలంలో వంతెనలు, రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవ కారణంగా నిధులు మంజూరయ్యాయి.

- గుల్లేలు నుంచి ఇంజరి మీదుగా కోంద్రుం తారురోడ్డుకు రూ.15 కోట్లు, బొయితిలి నుంచి జక్కం మీదుగా కోంద్రుం రోడ్డుకు రూ.15 కోట్లు, రూడకోట నుంచి జామిగుడ ఒడిశా బోర్డర్ వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.17 కోట్ల నిధులు ఆయన అరకు ఎమ్మెల్యే పాల్గుణ మంజూరు చేయించారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



దశాబ్దాల కాలంనాటి సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించింది. త్వరలో రోడ్లు, వంతెనలు, రోడ్లు అందుబాటులోకి రానున్నాయి. మారుమూల ప్రాంతాల సమస్యలను పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– గడుతూరి రామన్న పడాల్, మాజీ సర్పంచ్ గిన్నెలకోట

వర్షాలతో పనులకు ఆటంకం



వంతెన పనులకు వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడింది.వర్షాలు పూర్తిగా తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఆరు వంతెనలు పూర్తయితే వందల సంఖ్యలో గ్రామాలకు రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుంది.

– ఎంవీఎస్ సుబ్బారావు, డీఈఈ, గిరిజన సంక్షేమశాఖ, అరకులోయ

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన వివిధ తాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంజూరైన వివిధ పనుల పురోగతిని గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరై రూ.5 లక్షల లోపు, రూ.5 లక్షల పైబడి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కొన్నిచోట్ల సోర్స్‌లేకుండా పైప్‌లైన్ వేయడం, పైపులు కొనుగోలు చేయడం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సోర్స్ ఉండి పైపులైన్ వేస్తేనే మొదటిదశగా అడ్వాన్స్ చెల్లించాలని, పని పూర్తయిన తర్వాత పూర్తి బిల్లు చెల్లించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం ఒక కాంట్రాక్టర్‌కు ఐదు పనులు మాత్రమే అప్పగించడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులను అధిగమించడానికి ఒక్కో కాంట్రాక్టర్‌కు 10 పనుల వరకు అప్పగించవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే సంబంధిత పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించకూడదని నిబంధన విధించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శికి ప్రతిపాదిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు 56లో 3,325 పనులు మంజూరు కాగా 325 పనులు, ఉత్తర్వులు 8181 కింద 2,260 పనులు మంజూరు కాగా సుమారు 575 పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ ఉత్తర్వులు 918 కింద సుమారు 1300 పనులు మంజూరు అయినందున, నామినేషన్ పద్ధతిలో చేపట్టిన పనులు మినహాయించి మిగిలిన వాటికి టెండర్లు పిలవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జలజీవన్ మిషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ లీలాకృష్ణ, పాడేరు డివిజన్ 11 మండలాల సహాయ ఇంజనీర్లు, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చైతన్య పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



వైద్యసేవల వివరాలు తెలుసుకుంటున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: సుదూర ప్రాంతాల నుండి ఎంతో నమ్మకంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. గురువారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం, ఎన్ఆర్‌సీ సెంటర్, రక్తపరీక్ష, ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంకులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందేలా వైద్యసిబ్బంది కృషి చేయాలన్నారు. రోగులకు అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అత్యవసర కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. అనంతరం రోగుల వార్డులను పరిశీలించారు. అందుతున్న వైద్యసేవల గురించి వారి నుంచి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య పాల్గొన్నారు.

తండ్రి ఆశయసాధనకు నిరంతర కృషి

- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి
- వెలగలపాలెంలో మాజీ ఎమ్మెల్యే దేముడు వర్ధంతి
- నివాళులర్పించిన నేతలు
- రక్తదాన శిబిరం నిర్వహణ



గాం గంటందొర విగ్రహాన్ని ఆవిష్కరించిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి తదితరులు



దేముడు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు



రక్తదానం చేస్తున్న శివప్రసాద్ తదితరులు

కొయ్యూరు: తండ్రి ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. గురువారం ఆమె తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు ఎనిమిదో వర్ధంతిని వెలగలపాలెంలోని మెమోరియల్ పార్కు వద్ద నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి ఆమె దేముడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గాం గంటన్నదొర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తన కోటా నిధులతో అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. తండ్రి దేముడు నిరంతరం గిరిజనుల కోసం తప్పించేవారన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గొప్ప పోరాట యోధుడుగా నిలిచిన దేముడు గిరిజనుల గుండెల్లో చిరస్మరణీయులన్నారు. ఆయన పేదల కోసం చేసిన సేవలను ఎన్నటికి మరువలేమన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని తపించారన్నారు. ఆయన ఆశయాలు తమ ప్రభుత్వ హయాంలో నెరవేరాయన్నారు.నాడు కమ్యూనిస్టులు గిరిజనులు సాగు చేస్తున్న భూములు పట్టాలు ఇవ్వాలని ఆందోళనలు చేసేవారన్నారు.నేడు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వడంతో అది నెరవేరిందన్నారు. నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ తదితరులు రక్తదానం చేశారు.జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దేముడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జల్లి హలియారాణి, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, ఎంపీటీసీలు బి.అప్పారావు, సడ్డా మల్లేశ్వరి, గూడెం, చింతపల్లి,జి.మాడుగుల మండలాల ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

కాఫీ పండ్లు కిలో రూ.43

- కొనుగోలు ధర ప్రకటించిన ఐటీడీఏ పీవో అభిషేక్
- లావాదేవీల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



హాజరైన అధికారులు

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ పంటకు గిట్టుబాటు ధర అందించడమే లక్ష్యమని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం 11 మండలాల హార్టికల్చర్ కన్సల్టెంట్లు, ఏఈవోలు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, కాఫీ లైజన్ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాఫీ రైతుల నుంచి క్షేత్ర స్థాయిలో పండ్లను సేకరించి మాక్స్ సొసైటీకి తరలించే క్రమంలో తూకంలో ఐదు శాతానికి మించి వ్యత్యాసం ఉండకూడదన్నారు. అలా ఎక్కడైనా జరిగితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సేకరించిన కాఫీ పండ్లను లోడింగ్, ఆన్‌లైన్ చేసేటప్పుడు విధిగా సిబ్బంది సంతకాలు చేయాలన్నారు. ఈ ఏడాది మూడువేల టన్నుల కాఫీ పండ్ల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులు సేకరించే కాఫీ పండ్లకు కిలోకు రూ.43గా ధర నిర్ణయించామని ఆయన వెల్లడించారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు సహాయ సంచాలకుడు ఎస్. రమేష్, కాఫీ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో..

గూడెంకొత్తవీధి: జీసీసీ కాఫీ ధరలను ప్రకటించిందని బీఎం మల్లేశ్వరరావు గురువారం తెలిపారు.పార్చిమెంట్ కిలో రూ.280, అరాబిక చెర్రి కిలో రూ.145, రొబొస్టో చెర్రి రూ.70గా నిర్ధారించిందని ఆయన తెలిపారు. ప్రతీ డిపో ఎదుట ధరలను తెలుపుతూ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ కొరియర్‌లో రాళ్లు

- ఆన్‌లైన్ ఆర్డర్ బుక్ చేసిన వినియోగదారుడికి చేదు అనుభవం
- మొబైల్‌కు బదులు రాళ్లు, కనెక్టర్ లేని చార్జర్



కొరియర్ ద్వారా వచ్చిన సెల్‌ఫోన్ బాక్సులో రాళ్లు

రాజవొమ్మంగి: దసరా పండగ సందర్భంగా సెల్‌ఫోన్ కొనుక్కోవాలనుకున్న ఓ వినియోగదారుడికి చేదు అనుభవం ఎదురైంది. వివరాల్లోకి వెళితే రాజవొమ్మంగికి చెందిన పండు అనే ఓ యువకుడు ఆఫర్‌లో రూ.6 వేలకు వస్తోందని ఇంటెల్– ఏ60ఎస్ సెల్‌ఫోన్ కోసం ఓ ప్రముఖ ఆన్‌లైన్ కంపెనీకు ఆర్డర్ పెట్టాడు. సెల్‌ఫోన్ కోసం ఎదురు చూస్తున్న అతనికి గురువారం కొరియర్ బాయ్ ఫోన్ వచ్చిందంటూ ఓ బాక్స్ అందజేశాడు. ఆ యువకుడు ముందు జాగ్రత్తతో ఆ బాక్సును కొరియర్ బాయ్ ఎదురుగానే తెరిచాడు. తీరా ఆ బాక్సులో ఫోన్‌కు బదులు రెండు రాళ్లు, వైరు లేని చార్జర్ కనిపించడంతో అతనితోపాటు, ఇది చూసిన ఇరుగు పొరుగువారు అవాక్కయ్యారు. కొరియర్ బాయ్ వెంటనే సంబంధిత కొరియర్ కంపెనీకి ఫోన్ చేసి విషయం తెలియజేశాడు. ఆర్డర్ ప్రకారం సెల్‌ఫోన్ అందజేస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆ యువకుడు శాంతించాడు.

రేపు రోజ్‌గార్ మేళా

తాటిచెట్లపాలెం: దేశవ్యాప్తంగా 10వ రోజ్‌గార్ మేళాను 47 ప్రాంతాల్లో ఈనెల 28న నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో ఈ రోజ్‌గార్ మేళా నిర్వహిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో కై లాసపురంలో గల సాగరమాల కన్వెన్షన్‌లో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



పెదబయలుకు సమీపంలో పురుగుడ్డుపుట్టు జంక్షన్ వద్ద వ్యవసాయ క్షేత్రం కనువిందు చేస్తోంది. సుమారు ఎకరా విస్తీర్ణంలో రాగులు, సామ పంటలను వేసిన గిరిజన రైతు ఆ క్షేత్రం ఆకట్టుకునేలా చుట్టూ వలిసె విత్తనాలు చల్లాడు. ఇవి ప్రస్తుతం పూలతో కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి, పాడేరు

జీపు బోల్తా.. ఒకరి మృతి

- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- అతివేగంతో వస్తుండగా బ్రేకులు ఫెయిల్
- అదుపు తప్పడంతో ప్రమాదం



మృతి చెందిన రాజారావు



సంఘటన స్థలం పెదకోడాపల్లి ఘాట్ వద్ద గుమిగూడిన స్థానికులు



క్షతగాత్రులతో పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు



ప్రమాదానికి గురైన జీపు

పాడేరు రూరల్/పెదబయలు: పరిమితికి మించి ప్రయాణికులతో మితిమీరిన వేగంతో వస్తున్న ప్రైవేట్ జీపు బ్రేకులు ఫెయిలై అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. పెదబయలు మండలం పెదకోడాపల్లి ఘాట్ వద్ద గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ బంగారుమామిడి నుంచి ప్రైవేట్ జీపుగుత్తులపుట్టు వారపు సంతకు బయలుదేరింది. మధ్యలో చేతుపుట్టు, పులిగొంది గ్రామాల గిరిజనులు జీపు ఎక్కారు. సుమారు 15 మంది ప్రయాణికులతో వారపు సంతకు వేగంగా వస్తున్న జీపు పెదకోడాపల్లి నాల్గవ ఘాట్‌కు వచ్చేసరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై కుడివైపు రహదారి పక్కను ఉన్న రక్షణ గోడకు బలంగా ఢీకొట్టి ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. జీపు ఒక్కసారిగా గోడను ఢీకొట్టి కొండపైకి వెళ్లి బోల్తా పడింది. జీపులో ఉన్న ప్రయాణికులు చెల్లాచెదురయ్యారు. కొంతమంది జీపు కింద ఇరుక్కుపోయారు. ఇదే మార్గంలో వెళ్లేవారు వెంటనే క్షతగాత్రులను బయటకు తీశారు. 108 వాహనాలకు సమాచారం ఇచ్చారు. హుకుంపేటకు చెందిన 108 వాహన ఈఎంటీ శ్రీనివాసరావు, పైలెట్ చంద్రశేఖర్, జి.మాడుగుల 108 ఈఎంటీ రాజు సకాలంలో స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిలో పులిగొంది గ్రామానికి చెందిన పాంగి రాజారావు (31)కు అత్యవసర వైద్యం అందిస్తుండగా ఆస్పత్రిలో మృతి చెందాడు. గాయపడిన వారిలో పులిగొంది, చేదుపుట్టు గ్రామాలకు చెందిన పాంగి కృష్ణ, పాంగి మిటన్న, పాంగి ప్రభాష్, పాంగి సునీత, పాంగి అనిల్, మేనక, పి. కామరాజు, జి. సీతమ్మ, చరిత, పి. చిన్నయ్య, కె. చిన్న తదితరులు ఉన్నారు. వీరికి ఆస్పత్రిలో అత్యవసర వార్డులో ఉన్న ఆరుగురు వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

క్షతగాత్రులకు తక్షణ వైద్యం: అరకు ఎమ్మెల్యే పాల్గుణ ఆదేశం

జీపు బోల్తా ఘటనలో క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించాలని పాడేరు జిల్లా ఆస్పత్రి వైద్యులను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశించారు. ప్రమాద సంఘటనను తెలుసుకున్న ఆయన తక్షణం స్పందించారు. విజయవాడలో ఉన్న ఆయన ఫోన్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, ఆస్పత్రి వైద్యులను అప్రమత్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

క్లుప్తంగా

బైక్ దగ్ధం చేసిన దుండగులు



దగ్ధమైన బైక్

హుకుంపేట: మండల కేంద్రానికి సమీప గ్రామమైన డి.చింతలవీధిలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేశారు. వివరాలిలా ఉన్నాయి. డి.చింతలవీధి గ్రామానికి చెందిన పాంగి కామరాజు తన పల్సర్ బైక్‌ను ఎప్పట్లానే ఇంటి వద్ద పార్కింగ్ చేశారు. ఉదయం చూస్తే బైక్ దగ్ధమై ఉంది. ఎవరో కావాలనే రాత్రి పూట తన బైక్‌కు నిప్పంటించి ఉంటారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రెండు కార్లు ఢీ: ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

మారేడుమిల్లి: మండలంలోని గురువారం జరిగిన ప్రమాదంలో ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి కూనవరం వెళ్తున్న కారు, భద్రాచలం నుంచి కాకినాడ వెళ్తున్న కారు స్థానిక మారేడుమిల్లి -రంపచోడవరం రహదారిలో టేకు ప్లాంటేషన్ సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో కాకినాడకు చెందిన అంకిత్, రాజమండ్రికి చెందిన సుధీర్, సాయిరాంలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

'పారా'హుషార్

ప్రతిభకు వైకల్యం అడ్డంకి కాదని నిరూపించడమే కాదు.. ప్రధానితో శభాష్ అనిపించుకున్నాడు. దివ్యాంగులకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహిస్తారని డిగ్రీలోకి వచ్చే వరకు అతడికి తెలియదు. ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు కొల్లగొడుతున్నాడు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు ఆర్థిక సమస్యలు వెక్కిరిస్తున్నా, తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా సత్తా చాటుతున్నాడు. తాజాగా ఆసియా పారాలింపిక్ పోటీల్లో రజతం సాధించిన రొంగలి రవి పేరు ఒక్కసారిగా మార్మోగుతోంది.



దేశం తరఫున పతకం సాధించిన ఆనందంలో క్రీడాకారుడు రవి



షాట్‌పుట్ విసురుతున్న రవి

- ఆసియా పారా క్రీడా పోటీల్లో దివ్యాంగ క్రీడాకారుడికి రజతం
- అథ్లెటిక్స్‌లో రొంగలి రవి సత్తా
- స్వగ్రామం చిరికివానిపాలెంలో సంబరాలు
- రైతు కుటుంబం నుంచి రాణిస్తున్న యువకుడు

కె.కోటపాడు: చైనాలో ఆసియా పారా క్రీడా పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్ విభాగంలో దివ్యాంగ క్రీడాకారుడు రొంగలి రవి రజత పతకం సాధించి సర్వత్రా ప్రశంసలందుకుంటున్నాడు. అతడి విజయంతో కె.కోటపాడు మండలం వారాడ శివారు తన స్వగ్రామం చిరికివానిపాలెంలో సంబరాలు వెల్లివిరిశాయి. దేశానికి, పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు గుర్తింపును తీసుకొచ్చాడని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చదువుల్లోనూ ఉత్తమ ఫలితాలు

చిన్నప్పటి నుంచి రవి క్రీడలతోపాటు చదువుల్లోను ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు భీమిలి ఏఎంజీ పాఠశాలలో చదివాడు. పదిలో 9.0 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. ఎస్.కోటలో ఇంటర్ చదివి 933 మార్కులు, డిగ్రీలో 7.8 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించాడు.

17వ ఏట పారా క్రీడా పోటీలపై ఆసక్తి

ఇంటర్ చదువు పూర్తయిన సమయంలో దివ్యాంగులకు పారా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు రవి తెలుసుకున్నాడు. దీంతో తనకు ఆసక్తి ఉన్న బ్యాడ్మింటన్ పోటీలు 2015లో బెంగళూరులో నిర్వహించగా, అందులో ఉత్సాహంగా పాల్గొన్నాడు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బ్రాంజ్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.

- 2016 ఢిల్లీలో పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సింగిల్, డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ పొందాడు.
- 2017 హైదరాబాద్‌లో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.

ఆర్థిక పరిస్థితి కారణంగా బ్యాడ్మింటన్ నుంచి అథ్లెటిక్స్ వైపు..

దివ్యాంగ క్రీడాకారుడు రవిది రైతు కుటుంబం కావడంతో ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండేది. దాంతో బ్యాడ్మింటన్ పోటీలపై ఆసక్తి తగ్గించుకుని అథ్లెటిక్స్ విభాగంలో షార్ట్‌పుట్, జావెలిన్ త్రో పోటీల వైపు దృష్టి సారించాడు. అందులో భాగంగా పలు విభాగాల్లో రాణిస్తూ పతకాలు కొల్లగొడుతున్నాడు.

- 2017లో హర్యానాలో 18వ పారా చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్, జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ సాధించాడు.
- 2020 బెంగుళూరులో 3వ పారా అథ్లెటిక్స్ పోటీల్లో షార్ట్‌పుట్, జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్‌ను సాధించాడు.
- 2021 దుబాయ్‌లో 13వ ఫజీ పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో దేశం తరఫున పాల్గొన్న రవి షార్ట్‌పుట్, జావెలిన్ త్రోలో నాల్గో స్థానంలో నిలిచాడు.
- 2022లో పోర్చుగల్‌లో ఐవర్ వరల్డ్ అథ్లెటిక్స్ పోటీల్లో షార్ట్‌పుట్, జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్స్ సాధించాడు.
- ఈ ఏడాది జూన్‌లో పారిస్‌లో ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్‌లో ఐదో స్థానంలో నిలిచాడు.
- ప్రస్తుతం చైనాలో ఆసియా పారా క్రీడా పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు.

రైతు బిడ్డకు ఆర్థిక కష్టాలు

రవి తల్లిదండ్రులు రొంగలి దేముడుబాబు, మంగ స్వగ్రామం చిరికివానిపాలెంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు రవి దివ్యాంగుడైనప్పటికీ క్రీడల పట్ల అతడు చూపుతున్న ఆసక్తిని కాదన లేక ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పుసప్పో చేసి ప్రోత్సహిస్తున్నారు. వారి ఆశయాలను వమ్ము చేయకుండా రవి పట్టుదలతో అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నాడు. ఇతడి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2021లో బెంగళూరులో శాయి అకాడమీలో శిక్షణ ఇప్పించింది. ఆ సమయంలో వసతి, భోజన ఏర్పాట్లకు సంబంధించి ఖర్చులు తల్లిదండ్రులు పంపించేవారని రవి తెలిపాడు.



తల్లిదండ్రులు, సోదరుడితో రవి

తల్లిదండ్రుల శ్రమ ఫలితమే..

చైనాలోని ఆసియా పారా క్రీడా పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయం ద్వారా దేశ ప్రధాని నుంచి ప్రశంసలు అందుకోవడం ఎంతో మధురానుభూతికి లోనవుతున్నా. నా స్వగ్రామానికి పేరు ప్రఖ్యాతులు రావడం సంతోషంగా ఉంది. చిన్నప్పటి నుంచి చదువుతోపాటు క్రీడల్లో నా చురుకుదనాన్ని గుర్తించిన తల్లిదండ్రులు వారికి ఆర్థిక స్థోమత లేకపోయినా ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఈ రోజు దేశం గర్వించదగ్గ స్థాయిలో పతకం సాధించానంటే వారి శ్రమ ఫలితమే.. నాలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించిన ప్రభుత్వం బెంగళూరులో ఉచిత శిక్షణ అందించినందుకు కృతజ్ఞతలు.

– రొంగలి రవి, పారా అథ్లెట్

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నేతలు

కొయ్యూరు: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం ప్రభుత్వం మెరుగైన వైద్యం ఉచితంగా అందిస్తోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రావణాపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని, ప్రజల ఆరోగ్యంపై కనీస దృష్టి సారించలేదన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిచ్చిందని, ప్రతి ఒక్కరికి కార్పొరేట్‌కు దీటుగా ఉచితంగా వైద్యాన్ని అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గడప వద్దకే వైద్య సేవలందుతున్నాయన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఒక వైఎస్సార్ క్లీనిక్‌ను ఏర్పాటు చేసి సేవలందిస్తోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవల్లో శస్త్ర చికిత్సలు అవసరం అయిన వారిని తరలించి సర్జరీలు చేస్తారన్నారు. ఈ సురక్ష కేంద్రాలను అంతా ఉపయోగించుకోవాలని కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి పౌష్టికాహారం స్టాల్‌ను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య భద్రత పాటించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్ద ఎత్తున జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టారు. ఎంపీపీ బడుగు రమేష్, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, సర్పంచ్‌లు లక్ష్మి, రాజకుమారి, రమేష్, చందు, నూకాలమ్మ, చిన్నారావు, ఎంపీటీసీ సభ్యులు మల్లేశ్వరి, నూకరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సచివాలయ మండల కన్వీనర్ సుధాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమర్ల సూరిబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, నాయకులు సత్యనారాయణ, సూరిబాబు, గంగాధర్, అచ్యుత్, శేఖర్, గజ్జయ్యదొర, అచ్చిరాజు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాధవి దృష్టికి సమస్యలు



ఎంపీ మాధవికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

సాక్షి,పాడేరు: పాడేరుతో పాటు, అన్ని మండలాల్లో గిరిజన ఉద్యోగుల సంఘ భవనాలకు నిధులు మంజూరు చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని గిరిజన ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా నేతలు విన్నవించుకున్నారు. కొయ్యూరు మండలం శరభన్నపాలెంలో గిరిజన ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి ,అసోసియేట్ అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు తదితరులు ఎంపీ మాధవిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కొయ్యూరులో రూ.25లక్షల ఎంపీ నిధులతో గిరిజన ఉద్యోగుల సంఘ భవనం నిర్మాణంపై ఎంపీ మాధవికి వారు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ఉద్యోగుల సంఘ భవనాలు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన ఉద్యోగులకు వసతి సమస్య ఏర్పడుతుందని,ఈ మేరకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ మాధవి పాడేరులో సంఘ భవనానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

అటవీ పరిరక్షణ సామాజిక బాధ్యత



సమావేశానికి హాజరైన అధికారులు

సాక్షి, పాడేరు: జీవవైవిధ్యం నేల అడవినీరు, కలపేతర అటవీ ఫలసాయాలు, ఔషధ, సుగంధ మొక్కలు, ఇతర జీవరాశులను సంరక్షించుకుంటేనే సుస్థిరత సాధ్యమవుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జీవ వైవిధ్యభరిత వ్యవసాయ విధానాలు, సుస్థిర భూవనరుల యాజమాన్య కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ అటవీ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. జీవ వైవిధ్యం, ప్రకృతి వ్యవసాయం, సహజ వనరుల పరిరక్షణ ద్వారా గిరిజనులకు జీవనోపాధి భద్రత ఏర్పడుతుందన్నారు. అవసరమైన నేల, నీటి సంరక్షణ పనులు, వాటర్‌స్ట్రక్చర్ పనులకు ఉపాధి లేబర్ కాంపోనెంట్ నిధులను ఉపయోగించాలని సూచించారు. ఉపాధి, నీటిపారుదల అటవీ, వ్యవసాయ, ఉద్యాన అనుబంధశాఖల అధికారులు ఈ ల్యాండ్స్కేప్ అభివృద్ధి కార్యక్రమానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పశువుల మేత, పశువుల అభివృద్ధి కోసం పశుసంవర్ధకశాఖలో ఉన్న పథకాల లబ్ధి పొందాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఫార్మ్‌పాండ్లను గుర్తించాలని, రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైన్ ఫారెస్ట్ అలయన్స్ కన్సల్టెంట్లు డాక్టర్ కె.సుధీర్, ఎన్.హేమలత, వాసన్ అసోసియేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎల్.సన్యాసిరావు, ఫౌండేషన్ ఎకలాజికల్ సెక్యూరిటీస్ ప్రతినిధి ఆర్.కౌసలేందర్‌రావు, సీనియర్ మేనేజర్ పి.నాగేంద్రప్రసాద్, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, వ్యవసాయ, ఉద్యానశాఖల జిల్లా అధికారులు బీఎస్.నందు, ఎ.రమేష్‌కుమార్, స్పైసెస్‌బోర్డు క్షేత్రాధికారి బి.కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వెంకట్, సత్యనారాయణ

హుకుంపేట: రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉప్ప పాలమామిడి గ్రామానికి చెందిన తామర్ల వెంకట్, ఆర్.సత్యనారాయణలు ఉప్ప ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. కొట్నాపల్లి గ్రామ సమీపం పాడేరు–అరుకు జాతీయ రహదారిలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సత్యనారాయణకు తీవ్ర గాయలయ్యాయి. వెంకట్ తలకు బలమైన దెబ్బ తగిలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. 108కు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకున్నారు. క్షత గాత్రులను చికిత్సకోసం ఓ ప్రైవేటు వాహనంపై పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జెడ్పీ సీఈవో పోలినాయుడు బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా ఎం.పోలినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఈవోగా పనిచేస్తున్న పి.శ్రీరామ్మూర్తిని సహకార శాఖకు బదిలీ చేశారు. ప్రస్తుతం డి.పోలినాయుడు డివిజినల్ లెవెల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) హోదాలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు. ఆయన్ను జెడ్పీ సీఈవోగా నియమిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వి.మాడుగుల ఎంపీడీవోగా పోలినాయుడు పనిచేశారు. ఈ సందర్భంగా పోలినాయుడుకు పలువురు అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న బాలదేవ్

అరకులోయ రూరల్: కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రైతులు పండిస్తున్న కాఫీ, మిరియాలను గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయలని కోరారు. పాడేరు మన్యంలో 11మండలాల్లో గిరిజన రైతులు సుమారు15 మెట్రిక్ టన్నుల మేర కాఫీ, మిరియాలను పండిస్తున్నారని ఆయన వివరించారు.

ఉపాధ్యాయిని దుర్మరణం

- దేవరపల్లిలో రోడ్డు ప్రమాదం
- గాయాలతో బయటపడ్డ మరో టీచర్



బొడ్డు శ్రీదేవి (ఫైల్)

దేవరాపల్లి: సహచర ఉపాధ్యాయులను పలకరించారు.. విద్యార్థుల వందనాన్ని అందుకొని వారిని ముద్దులాడారు.. పాఠశాల పనిపై ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై క్షణాల్లో ప్రాణాలు కోల్పోయారు. కొద్ది సమయం ముందే తమ కళ్ల ముందు కనిపించిన ఉపాధ్యాయిని విగత జీవిగా మారడంతో విద్యార్థులు, సహోద్యోగులు దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రమాదంలో అదే వాహనంపై వెళుతున్న మరో టీచర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దేవరాపల్లిలో గురువారం ఈ ఘోరం జరిగింది. సబ్బవరం మండలం పెదనాయుడు పాలెం గ్రామానికి చెందిన బొడ్డు శ్రీదేవి (37) దేవరాపల్లి మండలం బేతపూడి కేజీబీవీలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె గురువారం ఉదయం యథావిధిగా పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయించడానికి తన సహచర ఉపాధ్యాయిని దేవితో కలిసి ద్విచక్రవాహనంపై బేతపూడి నుంచి దేవరాపల్లి బయలుదేరి వెళ్లారు. ఆటోస్టాండు దాటిన తర్వాత ఎదురుగావస్తున్న ఇసుక ట్రాక్టరును తప్పించే క్రమంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డు మీద పడిపోయారు. ట్రాక్టరు వైపు పడిపోయిన శ్రీదేవి ఛాతీ మీద నుంచి ట్రాక్టరు తొట్టె వెనుక చక్రం వెళ్లడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందారు. వాహనం నడుపుతూ మరో వైపు పడిపోయిన ఉపాధ్యాయిని దేవి ప్రాణాలతో బయటపడ్డారు. మృతి చెందిన ఉపాధ్యాయిని బొడ్డు శ్రీదేవికి భర్త నాగేశ్వరావుతో పాటు పదో తరగతి చదువుతున్న కుమార్తె త్రిషిక, నాలుగో తరగతి చదువుతున్న కుమారుడు కార్తికేయ ఉన్నారు. భర్త నాగేశ్వరరావు, ఇతర కుటుంబ సభ్యులు విలపించిన తీరు అక్కడున్న వారందరినీ కంట తడి పెట్టించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి సీహెచ్‌సీకి తరలించినట్లు స్థానిక పోలీసు ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. ట్రాక్టరును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉప రాష్ట్రపతి పర్యటన విజయవంతం చేయండి

వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మల్లికార్జున సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్

మహారాణిపేట: ఈ నెల 28న జరిగే ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. ఆయనతో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా పర్యటించనున్నారని వెల్లడించారు. ఈ పర్యటన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో పోలీసు, ఇండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఎంసీ శత వసంతాల వేడుకకు ఉపరాష్ట్రపతి హాజరవుతున్న నేపథ్యంలో.. ఆయన విశాఖ చేరుకున్నప్పటి నుంచి కార్యక్రమం ముగిసి తిరుగు పయనమయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమాలు జరిగే ఏయూ కన్వెన్షన్ సెంటర్, ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రత్యేక జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నేవీ అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో ఎక్కడైనా సుందరీకరణ చేపట్టాల్సిన పనులు ఉంటే త్వరితగతిన చేయాలని, పోర్టు రోడ్డులో దుమ్ము, ధూళి లేకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ దీపాలు అమర్చాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గార్డు ఆఫ్ ఆనర్ ఇతర సంప్రదాయక కార్యక్రమాల నిర్వహణలో నేవీ, పోలీసు శాఖ అధికారులు సమన్వయం వహించాలని చెప్పారు. సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇండియన్ నేవీ,ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ రవిశంకర్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం పలు ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తు, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐఎన్ఎస్ డేగ, ఆంధ్రా మెడికల్ కాలేజీ, ఏయూ కన్వెన్షన్ సెంటర్, ఈస్టర్న్ నావెల్ కమాండ్‌తోపాటు ఉప రాష్ట్రపతి పర్యటించనున్న ఇతర ప్రాంతాలలో భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

కేకే లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : దక్షిణమధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

➡ ఈ నెల 27, 28న విశాఖలో బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27 నుంచి 29 వరకు కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

➡ ఈ నెల 27, 28న హౌరాలో బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27 నుంచి 29 వరకు జగదల్‌పూర్ నుంచి బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి కాకుండా టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.